# ముసిరిన మబ్బులు : :

రచన :
శ్రీ జి. సత్య.

కాలేజీ ఆవరణంతా మహా సందడిగా వుంది. ఇంటర్వ్యూలకి వచ్చేవాళ్లు, కాలేజీ భాగోగులను పరామర్శించటానికి వచ్చే సీనియర్ స్టూడెంట్స్. రంగు రంగుల్లో, అనేక హంగుల్లో అలంకరించుకొన్న సీతాకోక చిలుకల్లాంటి కన్నెలతో మాసిన కాలేజీ చక్కగా షైన్ అవుతుంది. రమేష్ కి కూడా ఈ రోజే ఇంటర్వ్యూ. ఇంటర్వ్యూ అంటే ఏమిటో మాకూ తెలుసుగాని ఇక్కడ కూడా అదే పద్ధతి. కనీసము విషయమైనా వచ్చినోట్లు అందించాలి. "నెక్స్ట్" అన్న పిలుపు రాగానే ప్రసాదరావుగారు గొడుగుని తీసికొని ఆఫీసుగదిలో అడుగుపెట్టారు.

"నమస్కారము సార్. నేను రమేష్ ఫాదర్ని" అంటూ విష్ చేశారు ప్రసాదరావుగారు.

"ష్, ఇలా కూర్చోండి," అని ఎటువైపో చూపించాడు ఆ ప్రిన్సిపాలీశ్వరుడు పరధ్యాన్యంగా, పట్టిక వంచిన తల ఎత్తకుండా.

"సార్! అబ్బాయి పోయినసారి పి. యూ. సి. ఇక్కడే చదివాడండి. ఈ సారి బి. యస్ సి.లో చేర్పిద్దామనుకుంటున్నాను."

"అలాగాండి. ప్రస్తుతము మా కాలేజి దుస్థితిలో ఉంది. అందుకే మా యిష్టానికి, అభిమతానికి వ్యతిరేకంగా డొనేషన్స్ కలెక్ట్ చేస్తున్నాము. అసలు మామూలుగా బి. యస్ సీకి వెయ్యి రూపాయలు డొనేషన్. మరి అబ్బాయి ఇక్కడే చదివాడంటున్నారు కాబట్టి 'ఎనిమిది వందలు చాల్లెండి" అంటూ ఇష్టమైతే ఉండు లేకపోతే పో అన్నట్లు చూశాడు ప్రిన్సిపాల్.

'అరెరె. మన కాలేజీ దుస్థితి సంగతి నాకు తెలియదాండి. పోయినసారి కూడా దుస్థితిలో ఉండబట్టి కదా అయిదు వందలు డొనేషన్ ఇచ్చాను. అలాగే కానీయండి మరి" అన్నారు కేర్ లెస్ గా ఎనిమిది వందలో లెక్కలోకి రాని ప్రసాదరావుగారు.

కానీ రమేష్ కి మాత్రం ఇదంతా మహా చిరాగ్గా ఉంది. ఈ ప్రిన్సిపాల్ ఎప్పుడూ ఇంతే. తను ప్రిన్సిపాలయిన ఎనిమిదేళ్ళనుండి కాలేజీ దుస్థితి దుస్థితి అని మొత్తుకుంటాడు.

ఎనిమిది వందలు చెల్లించుకొని అడ్మిట్ స్లిప్ తీసికొని ఆఫీసు దగ్గరకొచ్చారు తండ్రీ కొడుకులు. రమేష్ ను సర్టిఫికేట్స్ విషయాలన్నీ పూర్తి చేసుకుని రమ్మని కారులో వెళ్ళిపోయారు ప్రసాదరావుగారు. సర్టిఫికెట్లన్నీ ఆఫీసులో ఇచ్చేసి ఐడెంటిటీ కార్డు తీసికొని బయటికి నడిచాడు రమేష్. అతనికి సీటు దొరికిందన్న సంతోషము కించిత్తు కూడా లేదు. అతని మనసంతా రవి ఊహలతో నిండి ఉంది. ఈ రోజు తను బి. యస్. సి. లో చేరగలుగుతున్నాడంటే అదంతా రవి చలవే మరి. తల వంచుకుని పరధ్యాన్యంగా నడుస్తున్న అతను తనకు సూటిగా వస్తున్న చెప్పుల జతను చూసి తలెత్తాడు.

"ఒరేయ్! ఏమిట్రా. సీటు దొరికిందనే సంతోషము ఏ మాత్రమూ లేకుండా నీరసంగా నడుస్తున్నావు. నీ ఏడుపు మొఖమూ, నువ్వూను" రమేష్ భుజము తడిపేస్తూ అన్నాడు రవి.

అతని స్వభావము అటువంటిదే. ఐనా ఈ పరిస్థితిలో ఆ వాలకము చూస్తే రవికి సీటువచ్చేసిందేమో ననిపించింది. అందుకే ఎగిరి గంతేసి కౌగలించుకున్నాడు రవిని.

"రవిగా! నీ కెప్పుడూ, ఈరోజే దొరికిందా సీటు?"

"నాకా? నీకు దొరికినా నక్కవటమే లేదేమిటి అని అడిగావురా," అన్నాడు అదే లోపలి మబ్బుల్ని కప్పిపుచ్చే ఆ వింత నవ్వుతో.

"సర్లేవోయ్. నాకు దొరకటము కూడా గొప్పేనా? ప్రిన్సిపాల్ ని మళ్ళీ కలిశావా? ఏమన్నాడు?"

"ఏమంటాడు. 'ఒక్కొక్కదాన్ని ధర చెప్పాడు.

బి. ఏ. అయిదు వందలు, బి. ఎస్‌సి. ఎనిమిది వందలు, బి. కామ్ వెయ్యి. పోయిన సంవత్సరము వేరే కాలేజీలో చదివిన వాళ్ళకైతే ఒక రెండు వందలు ఎక్స్‌ట్రా. ధరలు మండిపోతున్నాయి కదూ!" అన్నాడు రవి నవ్వుతూ.

"రవీ! నువ్వు ఆ విధంగా నవ్వ మానేయి. అసలిప్పుడు ఏం చేద్దామనుకుంటున్నావు?"

"ఏం చేస్తాం అదుగో అతనే నన్ను ప్రిన్సిపాల్ దగ్గరికి తీసుకెళ్తానన్నాడు," అంటూ వెళ్ళిపోయాడు రవి.

అతను ప్రిన్సిపాల్ దగ్గరికి వెళ్ళటము ఇది నాలుగవ సారి. ఈ లోకానికి కావలసింది డబ్బు. ప్చ్! రవి విషయము తనే పట్టించుకోవాలి. రమేష్‌కి, రవికి స్నేహము కుదరడము ఏ పత్రికల్లోను వింతలూ - విడ్డూరాల్లో పడక పోవటము ఒక పెద్ద వింత. రవి తండ్రి కటిక పేద. అతను వేయిని బట్టలు తెచ్చుకొని రాలేడు. కాని రమేష్ పరిస్థితి వేరు.

ప్రసాదరావుగారు రమేష్ ఏం కావాలన్నా ఇదెందుకు అని అడిగేవారు కాదు. గానీ, అది కూడ కొనుక్కో అనేవారు. అలాంటి పెంపుడులో ఉన్న ఇతను రవితో ఎలా జత కలిపాడో గాని, అప్పట్నుంచి రవి అతని అరవ ప్రాణమని చెప్పచ్చు. ఆఫ్‌కోర్స్ స్నేహానికి అందము, అంతస్తు అవసరము లేదని ఇప్పుడు తెలుస్తుంది. కానీ అది తెలియని రోజుల్లోనే వాళ్ళిద్దరూ ఫ్రెండ్సయ్యారు. నిజంగా ఈ ప్రపంచములో అన్నీ తెలిసినవాడే తప్పటడుగు వేస్తాడు. ఏమీ తెలియని వాడు ఏమీ తెలియనట్లుగానే సాగిపోతాడు. అదే రవి రమేష్‌ది ఇప్పుడు తటస్థించి ఉంటే అతనితో స్నేహము చేసేవాడేనా? అతని బట్టలన్నీ చిరుగులున్నా అతని మనసుకు లేవు గా. కానీ అసలు రవి అంటే ఏమిటి అన్న విషయము అందరికీ క్వార్టర్లీ పరీక్షలు అవ్వాకే తెలిసింది. అతనిని పొగడని మాస్టర్ లేడు. అదే పరీక్షలో రమేష్‌కి ఒక్క తెలుగులో తప్ప మిగతా అన్నిట్లో ఫెయిల్ మార్కులు. రవిలాగా మార్కులు రావాలంటే ఏం చెయ్యాలి అని అతన్ని అడిగితే తనతో పాటే పెట్టుకొని చదువుతున్నాడు రవి. అప్పట్నుంచి రమేష్ కూడా రవిని దాటిపోలేకపోయినా, అతనికి దగ్గరగా వచ్చేవాడు. అలాగే హైస్కూల్ చదువు పూర్తయింది. రవి హెడ్ మాస్టర్ రికమండేషన్‌తో పి. యు. సి. లో చేరాడు. రమేష్ అయిదు వందలు డొనేషన్ ఇచ్చి చేరాడు. పి. యు. సి పరీక్షలు కూడా అయిపోయినవి. ఇద్దరూ తృప్తిగానే వ్రాశారు. పరీక్షలయిపోయిన తరువాత అతని తల్లి తండ్రులతో సహా 'సమర్ స్టే'కని ఊటీ వెళ్ళాడు. డబ్బున్నవాళ్లు (అందరూ కాకపోయిన) పేదవాళ్ళ కడుపులు లూటీ చేస్తూ ఊటీ వెళ్ళగలరు...మరి స్విస్ కూడా వెళ్ళగలరు. కానీ తెల్లారిలేస్తే రోటీ కోసము కోటి మార్గాలు వెతుక్కోవలసిన పేదవాళ్ళు ఏ ఊటీ వెళ్ళగలరు? ఏ బ్యూటీ చూడగలరు? వాళ్ళ మనసులతో పాటు శరీరాలు కూడా ధగధగ మండవలసిందే. వాళ్ళు తిరిగొచ్చేటప్పటికి రిజల్ట్సు వచ్చినయి. రవి, రమేష్‌లు ఫస్టు క్లాసులో పాసయ్యారు.

ఇద్దరూ బి. యస్. సి సీటు కోసము అప్లికేషన్ పెట్టారు. అప్లికేషన్ పెట్టిన వాళ్ళందరికీ యధావిధిగా ఇంటర్వ్యూ కార్డులు రాసాగినయి. తీరా అక్కడికి వెళ్ళిన తరువాత ధరలు వివరిస్తాడు ప్రిన్సిపాల్. విద్య నభ్యసించాలంటే డబ్బివ్వాలి. ప్రమోషన్ రావాలంటే డబ్బివ్వాలి. ఉద్యోగము దొరకాలంటే డబ్బివ్వాలి. ఎక్కడ చూసినా డబ్బు...డబ్బు...మానవ హృదయాలను మబ్బులా కప్పి వేసిన ఒక భయంకర మబ్బు. ఆ మబ్బు పట్టిన హృదయాలకి డబ్బు తప్ప ఇంకేమీ కనపడదు, దానికి వారు పెట్టిన అందమైన పేరే డొనేషన్, ఈ మాత్రానికి ఫస్టుక్లాసు లెందుకూ? చక్కగా థార్డ్‌లో పాసయి ఒక అయిదు వంద లిచ్చేస్తే నమస్కారము పెట్టి మరీ సీటిస్తారు. రవి తండ్రి నెల జీతము రెండువందలు. అంటే వాళ్ళు ఒక నాలుగు నెలలు పస్తు పడుకొంటే అతనికి చదువుకోవటానికి అవకాశమిస్తారన్న మాట.

ఇలా ఆలోచిస్తూ ఉండగానే వాళ్ళ ఇల్లు వచ్చేసింది.

మరొకసారి రవికి తనెలాగైనా సహాయము చేయాలి అనుకొన్నాడు రమేష్. అనాడే ప్రసాదరావుగారు బట్టలు కొనుక్కోమని రెండు వేలు రూపాయలు ఇచ్చారు. దాంట్లో రవికి ఒక వెయ్యి ఇచ్చేస్తే సరి అనుకున్నాడు. దాంతో అతని మనసు కొంచెము తేలిక పడింది.

బాత్‌రూమ్‌లోకి వెళ్ళి మొఖము కడుక్కొని కాఫీ త్రాగుతూ కూర్చున్నాడు. మళ్ళీ వాళ్ళింటిదాకా వెళ్ళట ఎందుకులే అని డబ్బు ఒక కవర్లో పెట్టి రవి కిమ్మని చెప్పి సురేష్‌కిచ్చాడు రమేష్. ఈ ఉత్తరములో రవి ఏం రాసుంటాడు అన్న సందేహము వచ్చింది రమేష్‌కి, కానీ మనసంతా చికాకుగా ఉండడము మూలాన బీచికి వెళ్దామనుకున్నాడు. అక్కడే చదువుదాములే అని ఉత్తరము మడిచి జేబులో పెట్టుకుని బయలుదేరాడు రమేష్.

* * *

వివిధ రకాల మనుషులతో, ఐస్‌క్రీములు, వేరుశనక్కాయలు అమ్మే వర్తకుల్తో, అనేక ప్రేమ జంటల కేరుగా సముద్రము హోర్ హోర్ మంటూ గారడి చేస్తోంది. రమేష్ మోకాళ్ళ మీద తల పెట్టుకుని ఆలోచిస్తూ కూర్చున్నాడు. నీళ్ళతో నిండి ఉన్న ఆ సముద్రానికి రమేష్ కళ్ళలోని రెండు కన్నీటి బొట్లు కలవడటము కొదవనుకుంటూ. ఇదేమిటి ఈ అబ్బాయి ఇలా కూర్చున్నాడేమిటి అనుకుందో ఏమో ఇతని వంకే చూసుకుంటూ వెళ్తోంది. ఇంకో సమయంలో అయితే అతని చూపులు ఆమె పమిటగుండా దూరి గుండెలను చీల్చుకుని అవతలివైపుకు వెళ్ళేవి. కానీ ఇప్పుడు తన పరిస్థితి వేరు. అతని కడుపులో జ్వాలలు ... గుండెలలో మంటలు ... ఎన్నటికీ తీరనవి. ఆకాశములో చంద్రుడు దివ్యంగా వెలిగిపోతున్నాడు. రెండు మబ్బులు అటునుంచి తరుముకొస్తున్నాయి. రమేష్ కళ్ళనుండి కారుతున్న కన్నీళ్ళు యింకిన మచ్చకూడా లేకుండా యింకిపోతున్నవి ఆ యిసుకలో. కళ్ళు తుడుచుకుని ఆ ఉత్తరము చదవసాగాడు రమేష్.

ప్రియ రమేష్,

బ్రతకవలసిన మార్గములో బ్రతకలేకపోతున్నాననే బాధతో, బ్రతకటానికి అనేక మార్గాలున్న ఈ సంఘము నా లాంటి వాళ్ళను బ్రతకనివ్వదనే నిరాశతో, ఈ బ్రతుకు బ్రతికి మరెన్నో బ్రతుకులను బాధించట మిష్టములేక ఈ నా బ్రతుకును అంతము చేస్తున్నాను (నీవీ ఉత్తరము చదివేటప్పటికి). నాకు ఫీజు కట్టటానికి నాన్నగారు అమ్మ మెడలోని మంగళ సూత్రము కూడా అమ్మటానికి సిద్ధమయ్యారు. ఈ లోకంలో బ్రతక లేక కాదు. లేకపోతే ఈ సంఘాన్ని ఎదిరించక లేక కాదు. అమ్మల్ని ఆఖరికి మంగళసూత్ర మమ్ముకునే దశకు తీసుకొని వచ్చిన ఈ పాపిష్టి సంఘాన్ని చూడటము ఇష్టము లేక, నాకే తెలియని ఆ దూర దూరాలకు తేలిపోతున్నాను. ఎప్పుడూ నవ్వటానికి ప్రయత్నించు. నిన్ను విడిచి వెళ్ళాలని లేకపోయినా......

నీ, రవి.

పరుగెత్తుకొని వస్తున్న మబ్బులు చంద్రుణ్ణి కప్పివేసి వెలుగును దూరము చేసాయి. డబ్బు ఎలాగయితే మానవత్వాన్ని పొట్టన పెట్టుకుందో, అలాగే సముద్రపు నీళ్ళు రవిని పొట్టలో పెట్టుకొంది.